ప్రజాశక్తి

గురువారం 9 మే 2024

I

అల్లూరి సీతారామరాజు

నేడు కూనవరంలో సిపిఎం బహిరంగ సభ

- సీతారాం ఏచూరి రాక

ప్రజాశక్తి - కూనవరం: కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ(ఎంఎల్), మాస్‌లైన్ (ప్రజాపంథా), ఏజెన్సీ గిరిజన సంఘం, ఆదివాసీ సంఘాలు బలపరిచిన సిపిఎం అరకు ఎంపీ అభ్యర్థి పి.అప్పలనర్స, రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావుల విజయాన్ని కాంక్షిస్తూ గురువారం సాయంత్రం 4 గంటలకు అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండల కేంద్రంలోని పోలీస్ గ్రౌండ్ పక్కన భారీ బహిరంగ సభ జరుగనుంది. దీనికి ముఖ్య అతిథులుగా సిపిఎం అఖిల భారత కార్యదర్శి సీతారాం ఏచూరి, కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఎం ఎపి రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తదితరులు హాజరుకానున్నారు. తొలుత మధ్యాహ్నం 3 గంటలకు విఆర్.పురం మండలంలోని రేఖపల్లి నుంచి కూనవరం వరకూ బైకు ర్యాలీ, రోడ్‌షో ఉంటాయి. ఆయా కార్యక్రమాలను జయప్రదం చేయాలని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది.

ఉత్సాహంగా బృందాకరత్ సభలు

▶▶ పాడేరు ఏజెన్సీలో సిపిఎం జోష్

▶▶ ఆదివాసీల హక్కులు, చట్టాల రక్షణకు ఇండియా బ్లాక్ అభ్యర్థులను గెలిపించాలని వక్తలు పిలుపు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, పాడేరు, చింతపల్లి విలేకరులు

అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో బుధవారం సిపిఎం ఎన్నికల ప్రచార సభలు ఉత్సాహంగా సాగాయి. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ ప్రసంగం ఆదివాసీలను ఆలోచింపజేసింది. గిరిజన ప్రాంతంలోని వనరులను కార్పొరేట్లకు అప్పగించేందుకే అటవీ సంరక్షణ చట్టాన్ని కేంద్ర బిజెపి ప్రభుత్వం సవరించిందని బృందాకరత్ ఆయా సభల్లో పేర్కొన్నారు. బడా కార్పొరేట్ల లాభాల కోసం ఆదివాసీ హక్కులను దెబ్బతీస్తున్న బిజెపిని, దానికి తొత్తులుగా వ్యవహరిస్తున్న టిడిపి, వైసిపిలను ఓడించాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ హక్కులను కాపాడే ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని ఆమె కోరారు. ఇండియా వేదిక తరపున బరిలో ఉన్న సిపిఎం అరకు ఎంపీ అభ్యర్థి పి.అప్పలనర్స, పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి శతక బుల్లిబాబులకు మద్దతుగా అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, చింతపల్లిల్లో బుధవారం రోడ్‌షో, బహిరంగ సభలు జరిగాయి. వీటికి ముఖ్య అతిథిగా హాజరైన బృందాకరత్ తన ప్రసంగంతో, పాలకులకు సంధించిన ప్రశ్నలతో ఆకట్టుకున్నారు. ఆదివాసీ వ్యతిరేకులకు ఈ ఎన్నికల ద్వారా బుద్ధిచెప్పాలన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ గత పదేళ్లలో గిరిజనప్రాంత అభివృద్ధి కుంటుపడిందన్నారు. అడవులను, అటవీ చట్టాలను, హక్కులను రక్షించుకోవడానికి అప్పలనర్సను అరకు ఎంపీగా, బుల్లిబాబును పాడేరు ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలను కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ మాట్లాడుతూ గిరిజనులు పోరాడి సాధించుకున్న అటవీ భూముల హక్కు పత్రాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ తన ఫొటో వేయించుకుని గిరిజనులను మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఆదివాసీ పోరాటాల్లో అండగా నిలిచి, చట్టసభల్లో ప్రజాగళాన్ని వినిపించే సత్తా ఉన్నా నాయకులను ఈ ఎన్నికల్లో గెలిపించుకోవాలని కోరారు. సిపిఎం అరకు ఎంపీ అభ్యర్థి పి.అప్పలనర్స మాట్లాడుతూ గిరిజన ప్రాంతం పట్ల నిర్లక్ష్యం వహించిన పాలక పక్షాలను ఓడించాలని పిలుపునిచ్చారు. ఆదివాసీల ఓట్లు వేయించుకుని మైనింగ్ ఏజెంట్లుగా మారిపోయి, గిరిజనులకు ఆధారమైన అడవులను కట్టబెట్టేందుకు పోటీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను తరిమితరిమి కొట్టాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ ఏజెన్సీలో హైడ్రో పవర్ ప్రాజెక్టుల కోసం అటవీ భూములను అదానీకి అప్పగించేందుకు సిద్ధమైన పాలక పార్టీలను ఎన్నికల్లో ఓడించాలన్నారు. ఆయా సభల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు, కాంగ్రెస్ పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి శతక బుల్లిబాబు, కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ పార్టీల నాయకులు కంకిపాటి వీరన్నపడాల్, వంతల కృష్ణారావు, కుర్ర సూరిబాబు, కూడా సింహాచలం, ఎస్.గంగరాజు, సిపిఎం నాయకులు పాంగి ధనుంజయ్, సాగిన చిరంజీవి, గాలికొండ ఎంపిటిసి అంపురంగి బుజ్జిబాబు, శాంతి, సూరిబాబు, సిపిఐ నాయకులు పోతురాజు, ఎర్రబొమ్మల ఎంపిటిసి సభ్యుడు సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

భారీ ర్యాలీలు, ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు

పాడేరులో నిర్వహించిన రోడ్‌షోలో బృందాకరత్, లోకనాథం, సిహెచ్.నర్సింగరావు తదితరులు పాల్గొనగా వారికి ఆదివాసీలు ఘన స్వాగతం పలికారు. గిరిజన మహిళలు థింసా నృత్యంతో ఆకట్టుకున్నారు. పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు రోడ్డు షో సాగింది. దారి పొడుగునా బృందాకరత్ ప్రజలకు అభివాదం చేస్తూ ఇండియా కూటమి బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అనంతరం అంబేద్కర్ సెంటర్‌లో సభ జరిగింది. చింతపల్లిలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం నుంచి సంత బయలు మీదుగా పాత బస్టాండు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు

మాట్లాడుతున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, చిత్రంలో అప్పలనర్స, బుల్లిబాబు

బృందాకరత్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

ర్యాలీలో పాల్గొన్న బృందాకరత్, అప్పలనర్స, బుల్లిబాబు, లోకనాథం, నర్సింగరావు, తదితరులు

థింసా నృత్యం తో ఆకట్టుకున్న గిరిజన కళాకారులు

ఖాళీ బిందెలతో రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న మహిళలు, గ్రామస్తులు

తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆందోళన

ప్రజాశక్తి- విఆర్.పురం

మండలంలోని వడ్డిగూడెం పంచాయతీ పరిధి డొంకవీధిలో తాగునీటి సమస్యను కోరుతూ స్థానిక మహిళలు ఖాళీ బిందెలతో ప్రధాన రహదారిపై బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకపక్క ఎండలు భగభగ మండుతుంటే నీళ్ళు లేక, కరెంటు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్యపై ఎన్నిసార్లు ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సౌకర్యం కల్పించని నాయకులకు ఓటు అడిగే హక్కు లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలని నిరసన

ప్రజాశక్తి- విఆర్.పురం

తమకు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణమే చెల్లించాలని కోరుతూ మండలంలోని రేఖపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆసుపత్రి వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. జీతాలు చెల్లించాలని అనేకసార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా కనికరం కూడా చూపించట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీర్ఘకాలిక రోగాలు ఉన్న సిబ్బంది నెల నెల మందులు కొనుక్కోలేని పరిస్థితి నెలకొందని వాపోయారు. ఇఎస్ఐ కట్టవలసి ఉందని, వాయిదాలు కట్టలేక పెనాల్టీ రూపంలో సొమ్ములు నష్టపోతున్నామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి తమ ఆర్థిక పరమైన బాధలను అర్థం చేసుకుని పెండింగ్ జీతాలు ఇప్పించాలని కోరారు.

ఆసుపత్రి ఎదుట నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

ఎన్నికల నిబంధనలను అమలు చేయాలి

-పార్లమెంటు సాదారణ పరిశీలకులు ప్రమోద్ కుమార్ మెహర్ద

ప్రజాశక్తి-పాడేరు: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో ఎన్నికల కమిషన్ నిబంధనలను పక్కాగా అమలు చేయాలని అరకు పార్లమెంటు నియోజక వర్గం సాదారణ పరిశీలకులు ప్రమోద్ కుమార్ మెహర్ద సూచించారు. మన్యం పార్వతీ పురం కలెక్టరేట్ నుండి జిల్లా ఎన్నికల అధికారులు, సాలూరు, కురుపాం, పాలకొండ పాడేరు, అరకువ్యాలీ, రంపచోడవరం, పార్వతీపురం నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు, రాజకీయ పార్టీల అభ్యర్థులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజకీయ పార్టీల అభ్యర్ధులు, ఏజెంట్ల సహకారంతో ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. రెండవ ర్యాండమైజేషన్ పూర్తి చేసారని బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు నంబర్లను సరిచూసుకోవాలని చెప్పారు. శాంతి భద్రతలను సమర్ధవంతంగా అమలు చేయాలని స్పష్టం చేసారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికలలో నిలబడ్డ అభ్యర్థులు బ్యాంకు చెక్కులు, ఆర్‌టిజిఎస్ ద్వారా చెల్లింపులు చేయాలని పేర్కొన్నారు. ఎక్కడైనా ఘర్షణలు జరిగితే పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు.

జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాలను వేరే ప్రాంతాలకు తరలించిన గ్రామాలలో ఓటర్లకు ఓటు హక్కు వినియోగించుకోవడానికి రవాణా సదుపాయాలు ఏర్పాటు చేసామని చెప్పారు.

జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ శాంతి భద్రతలకు ఎటువంటి ఆటంకం కలగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టామని తెలిపారు. సార్వత్రిక ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించడానికి తగిన చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో పాడేరు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ భావనా పశిష్ట. అరకు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి వి.అభిషేక్, డి. ఆర్.ఓ, బి.పద్మాపతి, సిపిఎం అభ్యర్ధి పాచిపెంట అప్పల నర్స, భారత్ ఆదివాసీ పార్టీ అభ్యర్థి ఎం.రాజబాబు, స్వతంత్ర అభ్యర్థి ఎస్.బాలకృష్ణ పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన కలెక్టర్, ఎస్పి

యువకులు రక్తదానం చేయాలి

ప్రజాశక్తి పాడేరు: ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని వ్యవస్థాపకులు జీన్ హెన్రీ డ్యూనాట్ జయంతిని పురస్కరించుకొని పాడేరు అల్లూరి జిల్లా బ్రాంచ్ కార్యాలయంలో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర మాట్లాడుతూ, హెన్రీ డ్యూనాంట్ స్ఫూర్తితో ప్రపంచ దేశాలలో అత్యవసర సేవలను అందిస్తున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారికి అభినందనలు తెలిపారు. ప్రజలు, యువకులు సేవా దృక్పథంతో స్వచ్ఛందంగా రెడ్ క్రాస్ సంస్థలో చేరి సేవలందించాలని సూచించారు. ఉత్సాహవంతులైన యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. ప్రాణాపాయంలో ఉన్న రోగులకు ప్రాణ దాతలుగా నిలవాలన్నారు. బ్రాంచ్ కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి స్వచ్ఛందంగా ఆరు యూనిట్లు రక్తాన్ని అందించిన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజీవ్, రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ లోహితాస్, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు పి.సూర్యారావు, వి.జయలక్ష్మి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నివాళి అర్పిస్తున్న సూపరింటెండెంట్

పోలవరం నిర్వాసితుల పట్ల చిన్నచూపు

- ముంపు గ్రామాలు, బాధితుల గుర్తింపులో అన్యాయం
- పూర్తిగా చెల్లించని ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ
- భూమికి భూమి ఇవ్వడంలోనూ అదే ధోరణి
- వరదలకు మునిగిపోతున్న పునరావాస కాలనీలు
- మోసం చేసిన బిజెపి, టిడిపి, వైసిపి
- నిర్వాసితులకు అండగా సిపిఎం

ప్రజాశక్తి- చింతూరు

రాష్ట్రానికి జీవనాడి వంటి పోలవరం ప్రాజెక్టుకు భూములు, గ్రామాలను, తమ సర్వసం త్యాగం చేసిన నిర్వాసితులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయి. ప్రాజెక్టు వల్ల ముంపునకు గురై గ్రామాలు, బాధితుల గుర్తింపు నుండి, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, భూమికి భూమి, పునరావాసం కల్పించడం వరకు అన్నింటా బాధితులకు పాలకులు, అధికారులు అన్యాయం చేశారు. చివరికి ముంపు గ్రామాల ప్రజల కోసం నిర్మించిన పునరావాస కాలనీలు సైతం వరద ముంపునకు గురయ్యాయంటే నిర్వాసితుల పట్ల ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించారో అర్థం చేసుకోవచ్చు. నిర్వాసితుల పునరావాసం, ప్యాకేజీకి ఇవ్వాల్సిన నిధులు కేంద్ర బిజెపి ప్రభుత్వం ఇవ్వకపోగా, మొదటి టిడిపి, నేటి వైసిపి ప్రభుత్వాలు ప్రాజెక్టు నిర్మాణం విషయంలో చూపించిన శ్రద్ధ నిర్వాసితుల పట్ల చూపించలేదు. తొలి నుండి ఇప్పటి వరకు నిర్వాసితులకు సిపిఎం మాత్రమే అండగా ఉంటుంది.

కాంటూరు సర్వేలో మోసపూరిత లెక్కలు

పోలవరం పునరావాసానికి సంబంధించి 41.15 కాంటూరు లెక్కల ప్రకారం ప్రభుత్వం చెబుతున్న ముంపునకు గురైన గ్రామాల సంఖ్య 20 ప్లస్ 36 మొత్తం 56 గ్రామాలు. కాని వాస్తవంగా ముంపుకు గురయ్యేవి 193 గ్రామాలు. కాంటూర్ సర్వేలో తప్పుడు లెక్కలతో మోసపూరితంగా ప్రభుత్వం వ్యవహరిస్తుంది. చింతూరు, కూనవరం మండలాల్లో కేవలం ఒక్కొక్క గ్రామం మాత్రమే మొదటి దశలో మునిగే గ్రామాల జాబితాలో లెక్క వేశారు. కానీ 2022 వరదల్లో ఈ రెండు మండలాల్లోని అన్ని గ్రామాలు మునిగిపోయాయి.

పరిహారం చెల్లింపు వాగ్దానం విస్మరణ

వైసిపి ప్రభుత్వం పరిహారం కింద రూ.10 లక్షలు ఇస్తామని వాగ్దానం చేసింది. కాని ఇచ్చింది రూ.6.5 లక్షలు మాత్రమే. 19000 ఎకరాలకు భూమికి భూమి ఇవ్వాల్సి ఉండగా, కేవలం 8వేల ఎకరాలకు మాత్రమే ఇచ్చింది. మొదటి దశ ప్రభుత్వ లెక్కల ప్రకారం ముంపునకు గురయ్యే ఇళ్లు 29,000 కాగా, పునరావాసం కల్పించింది 14000 మందికి మాత్రమే. మరో వైపు 2022లో వచ్చిన వరదల సమయంలో నిర్వాసితుల కోసం నిర్మించిన ఈ పునరావాస కాలనీలు సైతం మునిగిపోయాయి.

కాంటూరు లెక్కలన్నీ కాకి లెక్కలే..

కాంటూరు పేరుతో ప్రభుత్వం తయారు చేసిన 41.15, 45.72 మీటర్ల పరిధిలో ఉండే గ్రామాల జాబితా తప్పుల తడక అని 2019 తర్వాత వచ్చిన వరదలు మరీ ముఖ్యంగా 2022 వరదలు నిరూపించాయి. 1986 నాటి వరదలకు మించిన 2022లో ముంపు మండలాల్లో వరద బీభత్సం సృష్టించింది. పోలవరం ఎగువ కాపర్ డ్యాం వద్ద 2022 జులై 15న 35 మీటర్ల ఎత్తుకు నీరు చేరింది. 19వ తేదీన గరిష్టంగా 44 మీటర్లుకు చేరడంతో పూర్తిస్థాయిలో ఎత్తేసి నీటిని కిందికి వదిలేశారు. కాపర్ డ్యామ్ వద్ద 35 మీటర్ల ఎత్తుకు నీరు వస్తేనే చింతూరు, విఆర్.పురం, కూనవరం, ఎటపాక, కుకునూరు, ఏలేరుపాడు తదితర ఆరు మండలాల్లో దాదాపు 70 వేలకు పైబడిన కుటుంబాలు నీట మునిగాయని వరదల సమయంలో ప్రభుత్వ లెక్కలు తేల్చాయి. ఒక్క కూనవరం మండలంలోని 28 వేలు నుండి 30 వేల కుటుంబాలు సంపూర్ణంగా మునిగిపోయాయి. అలాంటిది ప్రభుత్వం కాంటూరు లెక్కలు 41.15 మీటర్ల ఎత్తు నీరు నిండితే కూనవరం మండలంలో ఒక్క బొజ్జరాయి గూడెం గ్రామంలోని 261 కుటుంబాలు మాత్రమే మునుగుతాయని లెక్కలు వేశారంటే ప్రభుత్వం, అధికారులు నిర్వాసితుల పట్ల ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

లైడార్ సర్వేలోనూ కాకిలెక్కలే

2022 వరదలు తరువాత మళ్లీ లైడార్ సర్వే చేశారు. మొత్తం ప్రాజెక్టు పరిధిలో మరో 36 గ్రామాలు 41.15 మీటర్ల కాంటూరు పరిధిలో మునుగుతాయని తేల్చారు. 2022 వరదల సమయంలో కళ్ళుండి చూసిన వారికి ఎవరికైనా ఏ గ్రామాలు మునిగిపోయాయో తెలిసింది. కాని మళ్లీ లైడార్ సర్వే అని ప్రజలను మభ్యపెట్టి కాకిలెక్కలు వేశారు. చింతూరు మండల కేంద్రం నుండి చట్టి సెంటర్ వరకు 2022 వరదల్లో ఇంటి పైకప్పులు కూడా కనపడకుండా మునిగిపోగా, ఆ ఇళ్లు ఏపీ 41.15 కాంటూరు పరిధిలో లేవు. ఎటపాక పోలీస్ స్టేషన్ నుండి మురుమూరు గ్రామం వరకు, విఆర్.పురం, కుక్కునూరు మండలాల్లో అనేక గ్రామాలు వరదల్లో మునిగిపోయినా వాటిని పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం కాంటూరు 41.15 లెక్కలనే చూపుతోంది.

ఇవీ నిర్వాసితుల డిమాండ్లు...

నిర్వాసితులకు పరిహారం పూర్తిగా అందే వరకు గ్రామాలు ఖాళీ చేయరాదు. అంత వరకు ముంపు గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు యథావిధిగా కొనసాగించాలి. 1986, 2022 నాటికి వరదల ఆధారంగా ముంపు గ్రామాల రీ సర్వే చేయాలి. పునరావాసం దశల వారీగా కాకుండా ఏకకాలంలో అన్ని గ్రామాల్లో పూర్తి చేయాలి. మండలాన్ని యూనిట్‌గా తీసుకొని ఆర్ అండ్ ఆర్ పరిహారం అర్హులందరికీ ఇవ్వాలి. ముంపు మండలాల్లో ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న ప్రతి ఎకరాకు రూ.20 లక్షలు పరిహారం చెల్లించాలి. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి నిర్వాసిత కుటుంబానికి కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా రూ.10.50 లక్షలు పరిహారం ఇవ్వాలి. జీవో నెంబర్ 224 అమలు పరచాలి. గ్రామాలు ఖాళీ చేయించే నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులందరికీ, ప్రాజెక్టుకు భూ సేకరణ ప్రారంభమైన 2006 నుండి నేటి వరకు పెళ్లిళ్లు చేసుకున్న ఆడపిల్లలందరికీ రూ.6.50 లక్షల చొప్పున ప్యాకేజీ ఇవ్వాలి. సర్వం కోల్పోతున్న ప్రతి నిర్వాసిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి. ముంపు ప్రాంత ఉద్యోగులందరినీ తరలించే ప్రాంతాల్లో కొనసాగించాలి. నిర్వాసితుల కాలనీలో ఉపాధి హామీ పనులు ప్రారంభించాలి. ముంపు మండలాల్లో మునిగిపోతున్న పాఠశాలలు, కళాశాలలను పునరావాస కాలనీలో నిర్మించేందుకు సమగ్ర ప్రణాళిక తయారు చేయాలి. నిర్వాసితులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రతి డివిజన్ కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించాలి.

వరద ముంపునకు గురైన చింతూరు మండల కేంద్రం (ఫైల్‌ఫొటో)

బిక్కు బిక్కుమంటూ బతుకుతున్నాం

ప్రతి సంవత్సరం జూన్, జులై ఆగస్టు నెలల్లో మాకు గుండెల్లో దడ పుడుతుంది. బిక్కు బిక్కు మంటూ బతుకుతున్నాం. ప్యాకేజీ ఇస్తామని, పునరావాసం కల్పిస్తామని పదేళ్ల నుండి తెలుగుదేశం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వాళ్లు ఎన్నికల సమయంలో వచ్చి హామీలు ఇచ్చారే తప్పా రెండు ప్రభుత్వాలు ఇంతవరకు పరిహారంగాని, ప్యాకేజీగాని ఇవ్వలేదు. వరదలు వస్తున్న క్రమంలో ఇంట్లోని సామాన్లు పట్టుకొని ఎర్రంపేట ప్రభుత్వ పాఠశాలలో తల దాసుకుంటున్నాం. ఈ బాధలు ఇంకా ఎన్నాళ్ళు పడాలి. మాకు పరిహారం, పునరావాసం కల్పిస్తే సంతోషంగా ఇక్కడ నుండి సురక్షిత ప్రాంతానికి వెళ్లి సుఖంగా బతుకుతాం.

- రేగులబంద దుర్గ, చింతూరు

చట్ట సభల్లో మా బాధలు వినిపించేందుకు సిపిఎంకే ఓటు వేస్తాం

కాపరు డ్యామ్ కట్టడం వల్ల శబరి గోదావరి నదుల బ్యాక్ వాటర్ వెనక్కి తన్ని శబరి పొంగుతుంది. దీంతో శబరి ఒడ్డున ఉంటున్న మా కుటుంబాలన్నీ నీటమనిగిపోతున్నాయి. టిడిపి, వైసిపి ఇచ్చిన ప్యాకేజీ, పునరావాసం హామీలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. ఎన్నికల సమీపిస్తున్న వేళ రెండు పార్టీలు మభ్య పెట్టేందుకు మళ్లీ వస్తున్నాయి. అయితే మాకు ప్యాకేజీ, పరిహారంతో పాటుగా అన్ని రకాల సదుపాయాలతో పునరావాస కాలనీలు నిర్మించి ఇవ్వాలని కోరుతూ కమ్యూనిస్టు పార్టీ సిపిఎం నాయకులు పాదయాత్రలు చేసి మా బాధలను వెలుగులోకి తెచ్చారు. కాబట్టి చట్టసభల్లో మా సమస్యలు తెలియజేసేందుకు సిపిఎంకు మేము పూర్తి మద్దతు ఇస్తాం

- సీరాపు కనకరాజు, సంతపాకల వీధి, చింతూరు

జోరుగా సిపిఎం ప్రచారం

డుంబ్రిగుడలో ప్రచారం చేస్తున్న నేతలు

ప్రజాశక్తి- యంత్రాంగం

డుంబ్రిగుడ:ఇండియా కూటమి బలపరిచిన సిపిఎం అరకు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మండలంలోని పలు పంచాయతీ గ్రామాల్లో సిపిఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. పోతంగి పంచాయితీ పంతలచింత, అంత్రిగుడ, సంతవలస, బల్లుగుడ, శీలంగొంది, చంపపట్టి గ్రామల్లో సిపిఎం మండల నాయకులు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు మాట్లాడుతూ, గిరిజన హక్కులు, చట్టాల కోసం పనిచేస్తున్న సిపిఎం అభ్యర్థి అప్పనర్స కు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పి.సురేష్ కుమార్, టి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు:మండలంలోని ఏనుగురాయి పంచాయతీ వానబాసింగి, కొత్తూరు, ఏనుగురాయి, వనుగుపుట్టు, చోటముకిపుట్, గాదెలాగురుగు, లుంగపుట్, బొండాపుట్, తడపల్లిలో సిపిఎం నేతలు ప్రచారం చేశారు. లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్ మాట్లాడుతూ, పార్లమెంట్లో ఆదివాసీల గళం విప్పేందుకు ఇండియా కూటమి బలపరిచిన ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రూతుల. శంకర్, లక్ష్మీపురం సర్పంచ్ కె. త్రినాధ్, గాసిరం దొర, రామదాసు, నర్సింగ్ పడాల్, కె. బాలరాజు పాల్గొన్నారు.

పెదబయలు :మండలంలోని ఇంజారి, గిన్నెల కోట, బొడ్డగొంది కొరవంగి గ్రామాలలో సిపిఎం నాయకులు బోండా సన్నిబాబు, శ్రీనివాసరావు, శరబన్న, సునీల్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ గంగాధరం, చెండా సన్యాసి ప్రచారం నిర్వహించారు.

అనంతగిరి:మండలంలో డముకు, కాశీపట్నం వారపు సంతలో ఇండియా కూటమి బలపరిచిన సిపిఎం, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ వారపు సంతల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ, సమస్యలు పరిష్కారానికి కృషి చేసే నాయకులనే గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థి శెట్టి గంగాధర్ స్వామి, సిపిఎం మండల కార్యదర్శి ఎస్.నాగులు, పోకూరు సర్పంచ్ కిల్లో మోస్య, కాంగ్రెస్ మండల అద్యక్షుడు అప్పాలరాజు పాల్గొన్నారు

ఎటపాక : ఇండియా వేదిక బలపర్చిన సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఈ నెల 9న గురువారం కూనవరంలో జరుగు బహిరంగ సభకు వేలాది తరలివచ్చి, సిపిఎం అభ్యర్థులకు మద్దతుగా నిలవాలని కోరుతూ బుధవారం పలు ప్రాంతాల్లో సిపిఎం నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎటపాక మండలం పిచ్చుకలపాడు పంచాయతీ గుండు వారి గూడెం, తోగ్గుడెంలో జరిగిన సమావేశాల్లో సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు పాల్గొని మాట్లాడారు. సిపిఎం పోరాటాల ద్వారానే గిరిజనులకు పోడు భూములు దక్కాయని, కమ్యూనిస్టు పార్టీల చొరవతో వచ్చిన అటవీ హక్కుల చట్టం రావడంతోనే భూములకు హక్కు పత్రాలు వచ్చాయని తెలిపారు. ఆదివాసీలను అడవుల నుండి దూరం చేసేందుకు బిజెపి ప్రయత్నం చేస్తుందన్నారు. బీజేపీకి ప్రత్యక్షంగా టిడిపి, పరోక్షంగా వైసీపీ మద్దతిస్తున్నాయని, ఈ ఎన్నికల్లో ఆ మూడు పార్టీలకు బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు చేసే సిపిఎం అభ్యర్థులకు సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మర్లపాటి నాగేశ్వరావు, ఆకిశెట్టి రాము, ఇరప అజయ్, ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూనవరం : కూనవరం పోలీస్ స్టేషన్ గ్రౌండ్‌లో గురువారం జరుగు భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలోని చూచిరేవుల, భీమవరం, జగ్గారం గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులందరికీ చట్ట ప్రకారం పరిహారం చెల్లించేంత వరకు అసెంబ్లీలో, పార్లమెంటులో ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు సిపిఎం ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు బి.వెంకటేశ్వర్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకులు తాళ్లూరి కృష్ణ, నిమ్మల మధు, ఉపేందర్, ఆవుల మురళి, ఎంపీటీసీ కృష్ణ జయసుధ, కర్నాటి శ్రీనివాసరావు, జోగ్ రాజు, మడేం బాబురావు, పోడియం పిఎన్ఎం కళాకారులు పదం రాజు, కన్నారావు, ఏలూరు వంశీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవీపట్నం : పోలవరం నిర్వాసితులు, పేదలు, బలహీన వర్గాల కోసం పనిచేసే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.రవి విజ్ఞప్తి చేశారు. బుధవారం నాడు ఇందుకూరు, శరభవరం గ్రామాల్లో బుధవారం ఉపాధి హామీ పని ప్రదేశాల్లో పర్యటించి సిపిఎం అభ్యర్థులు గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాని తీసుకురావడంలో సిపిఎం కీలకపాత్ర పోషించిందని, ఇప్పుడు దానిని రక్షించుకోవడానికి కూలీలంతా సిపిఎంతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి వెంకట్రావు, పి.రామకృష్ణ, వి.సాయిబాబు, ఎ.శ్యామల రాణి, జి.సూర్యకిరణ్, జె.గోపి, కె విజయలక్ష్మి, బుల్లెమ్మ, బేబీ, చంటి తదితరులు పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలోని ములకనపల్లి పంచాయతీ పరిధి బంగారు గూడెం, ములకనపల్లి, రాజపేట పంచాయతీ పరిధి తోటపల్లి, మొద్దులగూడెం గ్రామంలో బుధవారం సిపిఎం నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సోయం చిన్నబాబు, పూనం సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర బిజెపి, రాష్ట్ర వైసిపి ప్రభుత్వాలు గిరిజనుల భూములను అదానీకి కట్టబెట్టే కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సవల మారయ్య, పులి సంతోష్ కుమార్, సిపిఎం నాయకులు బంగారు ప్రసాద్, సోడి మల్లయ్య, ప్రకాష్, కె.సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ నెల 9న కూనవరంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని మండలంలోని చొక్కనపల్లి గుంపులో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పులి సంతోష్ కుమార్, నాయకులు జి లక్ష్మణరావు, ఎ.కాంతారావు, తోడం రాజు, ధారయ్య పాల్గొన్నారు.

వై.రామవరం : మండలంలోని కె.ఎర్రగొండ పంచాయతీ వాన మామిడి గొంది గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను బుధవారం సిపిఎం నాయకులు కలిశారు. ఉపాధి హామీ కూలీలతో కలిసి సిపిఎం కార్యకర్తలు కొద్దిసేపు పని చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు శాంతిరాజు, రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి 200 పనిదినాలు కల్పించాలని, రోజు కూలి రూ.600 చెల్లించాలని సిపిఎం పోరాటం చేస్తుందని చెప్పారు. సిపిఎం ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, దుర్గ, వెంకన్న, ప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ

చింతూరు : సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మండలంలోని చిడుమూరు గ్రామంలో బుధవారం సిపిఎం కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అలాగే చింతూరు మండల కేంద్రంలోని సంత మార్కెట్లో సిపిఎం అభ్యర్థులకు ఓట్లు వేయాలని కరపత్ర ప్రచారం చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సీసం సురేష్, పల్లపు వెంకట్, లక్ష్మణ్, రాజయ్య, పాండు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చింతూరులో బైక్ ర్యాలీ

ప్రశాంతంగా ముగిసిన పోస్టల్ బ్యాలెట్

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకుంటున్న ఉద్యోగులు

ప్రజాశక్తి-పాడేరు:- పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిసింది. కంట బౌన్స్‌గూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటీస్ సెంటర్లో ఐదవ రోజు 598 మంది తమ ఓటు హక్కును వినియోగించు కున్నారని అరకు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వి.అభిషేక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అరకు నియోజకవర్గంలో 516 మంది, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గానికి 53 మంది, జిల్లాలకు చెందిన వారు 29 మంది పోస్టల్ బ్యాలెట్ విధానంలో ఓటు హక్కును వినియోగించుకున్నారని ఆయన చెప్పారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయం వద్ద ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్‌పై ఏర్పాటు చేసిన ప్రణాళికను అధికారులకు వివరించారు. ప్రణాళిక ప్రకారం ఈవీఎంల పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రతి మండలానికి ప్రత్యేకంగా పంపిణీ సెల్‌ను ఏర్పాటు చేశామన్నారు.ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఎస్‌డిసివిఎస్ శర్మ, తహసిల్దార్ సుధాకర్, సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎస్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన 434 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడం జరిగిందన్నారు.ఇతర జిల్లాల నుండి 58 మంది, పాడేరు నుండి ఒక్కరు పోస్టల్ బ్యాలెట్ను ఉపయోగించుకోవడం జరిగిందని రిటర్నింగ్ అధికారి తెలిపారు.

ఆరోపణలు తగవు : సిపిఎం

ప్రజాశక్తి పాడేరు: సిపిఎంపై ఆరోపణలు చేయడమంటే సూర్యుడిపై ఉమ్మేసినట్లేనని, బిజెపికి సహకరిస్తున్న భారత్ ఆదివాసీ పార్టీ అభ్యర్థి మొట్టడం రాజబాబు దురుద్దేశంతోనే తమ పార్టీపై అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, అల్లూరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఏ పార్టీ టికెట్ ఇవ్వకపోవడంతో భారత్ ఆదివాసీ పార్టీని ఆశ్రయించి టికెట్ సంపాందించుకొని బిజెపి, వైఎస్ఆర్, తెలుగుదేశం పార్టీ అభర్థులకు అన్ని విధాలా సహకరించి, ఆర్థికంగా లాభం పొందాలనే ఉద్దేశ్యంతోనే సిపిఎంపై రాజబాబు నిరాదరణ ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ ఎన్నికల్లో సిపిఎం ఎంపి అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సకి ప్రజలు ఎంతో ఆదరిస్తున్నారని, మాజీ మంత్రి కిశోర్ చంద్రదేవ్ వంటి నాయకులే తమ పార్టీకి సంపూర్ణమైన మద్దతిస్తున్నారని పేర్కొన్నారు. అనేక పార్టీలు, ప్రజాసంఘాలు భాగస్వామమై సిపిఎం విజయానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిని చూసి రాజబాబు ఓర్వలేని తనంతో లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, ఇలాంటి వారికి ప్రజలే తగిన గుణపాఠం చెపుతారన్నారు. మొన్నటి వరకు సిపిఐ పార్టీలో వుండి టికెట్ ఇవ్వకపోయే సరికి కమ్యూనిస్టులపై ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. నామినేషన్ కి ముందు ఆయనకు సహాయ సహకారాలందించాలని సిపిఎంని అభ్యర్థించారని, తాము ఇండియా బ్లాక్ ను బలపరుస్తున్నామని, దీన్ని సహించలేక ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కమ్యూనిస్టు పార్టీలు నీతి నిజాయితీకి నిలువటద్దమని,. ప్రజా సమస్యలపై నికరంగా పోరాడుతున్నాయని గుర్తు చేశారు. 1/70, జిఓ 3, కాఫీ, మిరియాల రైతులకు గిట్టుబాటు ధరలు, బాక్సైట్‌పై అనేక పోరాటాలు చేశామని తెలిపారు.

నిబంధనలకు అనుగుణంగా ఎన్నికలు నిర్వహించాలి

ప్రభుత్వ వాహనాల్లో ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించాలి

సిపిఎం అరుకు ఎంపీ అభ్యర్థి అప్పలనర్స విజ్ఞప్తి

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా ముంచంగిపుట్టు మండలంలో శాంతిభద్రతల పేరిట పోలింగ్ కేంద్రాలను వేరే చోటకి మార్చారని, కేంద్రాలు ఉంటేనే ఓటేస్తామని గిరిజనులు కోరుతున్నారని.. లేదంటే ఎన్నికలు బహిష్కరిస్తామని డిమాండ్ చేస్తున్నందున తక్షణమే అధికారులు స్పందించి ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా ఎన్నికలు నిర్వహించాలని అరకు లోక్‌సభ సిపిఎం అభ్యర్థి అప్పలనరస బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల బహిష్కరణ అనేది ప్రజాస్వామ్యానికి చేటని తెలిపారు. ముంచంగిపుట్టు మండలం బుంగ పుట్టు , కోసోంపుట్ పోలింగ్ కేంద్రాలు లక్ష్మీపురంలో 20 కిలోమీటర్ల దూరంలో మార్చారని, రంగబయలు పంచాయితీ లంగవ పాదొర్ పోలింగ్ కేంద్రం 18 కిలో మీటర్ల దూరంలో ఉన్న వనగుమ పంచాయితీ కేంద్రానికి మార్చారన్నారు. సుజనకోట గ్రామపంచాయతీ సుజనపేట పోలింగ్ కేంద్రానికి రావడానికి గొడుగులపుట్ గ్రామస్థులకు వాహనాలు ఏర్పాటు చేయాలని కోరారు. లక్ష్మీపురం గ్రామపంచాయతీ, దొరగూడ ఉబెంగుల, జబడ, కొడపుట్, కేందుగూడ, మూవులపుట్, బిర్రిగూడ గ్రామాల ఓటర్లు లక్ష్మీపురం కేంద్రానికి రావడానికి ప్రభుత్వ వాహనం ఏర్పాటు చేయాలనీ తెలిపారు.

ఏయూ న్యాయ కళాశాలకు పుస్తకాల బహూకరణ

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం న్యాయ కళాశాల విశ్రాంత ఆచార్యులు వి.కేశవరావు తాను రచించిన రెండు పుస్తకాలు ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్, ఇండియన్ కాంట్రాక్ట్ యాక్ట్ పుస్తకాలను న్యాయ కళాశాల గ్రంథాలయానికి బహూకరించారు. బుధవారం ఏయూ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డిని కార్యాలయంలో కలుసుకుని ఆయన చేతుల మీదుగా న్యాయ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య వి.విజయలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో ఆచార్య కె.సీతామాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ విద్యార్థులకు అమెరికా సంస్థలో ఉద్యోగాలు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం విద్యార్థులు 24 మందికి అమెరికాకు చెందిన యునైట్ సంస్థలో ఉద్యోగాలు లభించాయి. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల నుంచి 4, మహిళా ఇంజనీరింగ్ కళాశాల నుంచి 6, ఏయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం నుంచి 14 మంది విద్యార్థులను ఈ సంస్థ ఎంపిక చేసింది. వీరికి ఏయూ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి సమక్షంలో యునైట్ సంస్థ వ్యవస్థాపకుడు శ్రీధర్ అబ్బవరం నియామక పత్రాలను అందజేశారు. ఇంజనీరింగ్ విద్యార్థులతో పోటీపడి ప్రతిభ చూపుతూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం పట్ల సంతోషం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్, విభాగాధిపతి ఆచార్య జి.వీర్రాజు, ప్లేస్‌మెంట్ అధికారులు విఆర్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జల విద్యుత్ కేంద్రంలో తాగునీటి సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి-సీలేరు : సీలేరు జల విద్యుత్ కేంద్రంలో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఏపీ జెన్కో అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ఏపీ జెన్కో ఉద్యోగులు డిమాండ్ చేశారు. బుధవారం వారు ప్రజాశక్తితో మాట్లాడుతూ జలవిద్యుత్ కేంద్రంలో వాటర్ ప్యూరిఫైర్ 15 రోజులుగా పాడైపోయినా దాని మరమ్మతులకు అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదని తెలిపారు. ఇంతకుముందు వాటర్ ప్యూరిఫైర్ అనేకసార్లు పాడైతే తాత్కాలిక మరమ్మతులు నిర్వహించి వినియోగంలోకి తెచ్చినా అది సక్రమంగా పనిచేయడం లేదని పేర్కొన్నారు. ఒకపక్క అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్న కార్మికులు, తాగునీరు లేక మరింత ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. అధికారులకు ఈ విషయంపై ఎన్నిసార్లు విన్నవించిన పెడచెవిన పెడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఏపీ జెన్కో అధికారులు స్పందించి ఉద్యోగులకు తాగునీరు సౌకర్యం నిరంతరం జల విద్యుత్ కేంద్రంలో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



పాడైన వాటర్ ప్యూరిఫైయర్

గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్

ప్రజాశక్తి -మునగపాక

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరుతూ మండల కేంద్రం మునగపాకతో పాటుగా చూచుకొండ, పల్లపు ఆనందపురం, గణపర్తి, గంటవాని పాలెం, ఉమ్మలాడ, నాగులపల్లి, తిమ్మరాజుపేట, రాజుపేట, కాకరపల్లి తదితర గ్రామాలలో బుధవారం కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్ఐ ప్రసాదరావు మాట్లాడుతూ ప్రజలందరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. మండలంలో ఇప్పటికే 850 మందిని బైండోవర్ చేయడం జరిగిందన్నారు. ఎవరైనా ఉద్దేశ్య పూర్వకంగాగాని, రాజకీయంగా గాని ఎటువంటి గొడవలకు పాల్పడినా చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బుచ్చయ్యపేట : మండలంలోని ఎల్.సింగవరం, లోపూడి, బంగారుమెట్ట, చిన్నప్పన్నపాలెం, బుచ్చయ్యపేట, పోలేపల్లి కందిపూడి, దిబిడి తదితర గ్రామాల్లో పోలీసులు బుధవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చయ్యపేట ఎస్సై డి.ఈశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి వివాదాలకు పోకుండా ప్రతి ఒక్కరూ శాంతియుతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

కె.కోటపాడు : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడిన సహించేది లేదని స్థానిక ఎస్సై లక్ష్మీనారాయణ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం పోలీస్ సిబ్బందితో ఫ్లాగ్ మార్చ్ నిరసించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లోను కావద్దని, నిర్భయంగా నచ్చిన వారికి ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

13న దుకాణాలు, సంస్థలకు సెలవు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

సార్వత్రిక ఎన్నికల్లో కార్మికుల తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడానికి దుకాణాలకు, సంస్థలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించినట్లు చోడవరం సహాయ కార్మిక శాఖ అధికారి వి.సూర్యనారాయణ తెలిపారు. బుచ్చయ్యపేటలో బుధవారం ఆయన మాట్లాడుతూ చోడవరం కార్మిక శాఖ కార్యాలయ పరిధిలో సబ్బవరం, బుచ్చయ్యపేట, చోడవరం, చీడికాడ, కె.కోటపాడు, దేవరాపల్లి, రావికమతం తదితర మండలాల్లోని కార్మికులు వివిధ సంస్థల్లో పని చేస్తున్న సిబ్బంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న సిఆర్‌పిఎఫ్ సిబ్బంది

బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్ పిలుపునిచ్చారు. స్వచ్ఛభారత్ అభియాన్‌లో భాగంగా జికె.వీధి మండలం సీలేరు మెయిన్ డ్యాం గేట్లు చివర నుంచి ఒడిశా సరిహద్దు రహదారి చివరివరకు రోడ్డుకు ఇరువైపులా బుధవారం ఉదయం సిఆర్‌పిఎఫ్ సిబ్బందితో వ్యర్థాలను తొలగించి, ప్లాస్టిక్ బాటిళ్లు, బీరు బాటిళ్లు సేకరించి దూరంగా పడేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీలేరు జల విద్యుత్ కేంద్రం రెగ్యులేటరీ డ్యామ్, మెయిన్ డ్యామ్, సీలేరు నది పరివాహక ప్రాంతాల్లో ప్రకృతి రమణీయ దృశ్యాలు తిలకించడానికి వస్తుంటారని తెలిపారు. ఇటువంటి ప్రాంతంలో యువత బహిరంగంగా మద్యం సేవించి అక్కడే మద్యం బాటిళ్లు ప్లాస్టిక్ వ్యర్థాలు పడవేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇటువంటి కార్యకలాపాలకు ఇకనుంచి స్వస్తి పలికాలని హితవుపలికారు. ఏపీ జెన్కో అధికారులు మెయిన్ డ్యాం పరిసరాల్లో మందుబాబుల ఆగడాలు అరికట్టే విధంగా సెక్యూరిటీ సిబ్బందితో చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ ఇన్స్పెక్టర్ సుభాష్, సిఆర్పిఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

భయభ్రాంతులకు గురి చేస్తున్న సిఎం.రమేష్

అనకాపల్లి అభివద్ధికి కొణతాల ఏం చేశారు ?: వైసిపి నేత ఆడారి కిషోర్‌కుమార్

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి పార్లమెంట్ బిజెపి అభ్యర్థి సీఎం రమేష్ జిల్లా ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వైసిపి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆడారి కిషోర్ కుమార్ ఆరోపించారు. స్థానిక వివేకానంద సమావేశ మందిరంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిడిపిలో ఉన్నప్పుడు నరేంద్ర మోడీని తెగ విమర్శించిన సీఎం.రమేష్‌పై అనేక ఎఫ్ఐఆర్ నమోదయ్యాయని గుర్తు చేశారు. బిజెపిలో చేరిన తరువాత సీఎం రమేష్ పునీతుడయ్యాడా? అని ఎద్దేవా చేశారు. స్థానికేతరులకు టికెట్ ఇస్తే సహించేది లేదని బీరాలు పలికిన అయ్యన్నపాత్రుడు, ఇప్పుడు సిఎం రమేష్‌కు ఎలా లొంగిపోయారని ప్రశ్నించారు. మూడు శాఖల మంత్రిగా పనిచేస్తున్న కొణతాల అనకాపల్లి ప్రాంతంలో చేసిన అభివృద్ధి, యువతకు కల్పించిన ఉపాధి అవకాశాలు ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు.

15 ఏళ్ల అజ్ఞాతంలో ఉండి ప్రజా సమస్యలను విస్మరించిన ఆయన నేడు ఏ ముఖంతో ప్రజలను ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ బివి సత్యవతి, వైసిపి నాయకులు బుద్ధ శ్రీనివాసరావు మాట్లాడుతూ తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తానని సీఎం రమేష్, సాధ్యం కాదని కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ ప్రజలను రైతులను మభ్యపెడుతున్నారన్నారు. సమావేశంలో అచ్యుత్, శేషు, వెంకటరావు పాల్గొన్నారు.

విభజన హామీలు, ప్రత్యేక హోదా ఇవ్వకుండా మోసపుచ్చిన మోడీకి

ఓట్లు అడిగే నైతిక అర్హత లేదు..!

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎపికి విభజన హామీలు అమలు చేయకుండా, ప్రత్యేక హోదా ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేసి ప్రధాని మోడీ జిల్లా, రాష్ట్ర ప్రజలను ఎలా ఓట్లు అడుగుతున్నారని ఇండియా కూటమి బలపర్చిన అనకాపల్లి పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి వేగి వెంకటేష్ ప్రశ్నించారు. స్థానిక రోటరీ కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎపిలో ఐదువేల కిలోమీటర్ల జాతీయ రహదారి నిర్మించామని బహిరంగ సభలో చెప్పారని, మిగిలిన రాష్ట్రాల్లో వేసిన జాతీయ రహదారులను ఎపిలో వేసినట్టు మోడీ భ్రమిస్తున్నారా అని ప్రశ్నించారు. విభజన హామీలు అమలు చేయకపోవడంపై 2019లో చంద్రబాబు మోడీని విమర్శించారని, నేడు అదే వ్యక్తితో ములాఖత్ అయి ఎన్నికలకు రావడం ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు భూమి కేటాయించామని వైసిపి ప్రభుత్వం చెబుతుండగా, ఇవ్వలేదని బిజెపి చెప్పడం ఆ రెండు పార్టీల ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై మోడీ ఎందుకు మాట్లాడలేదన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కేవలం వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీ మాత్రమే పోరాటాలు చేస్తున్నాయని చెప్పారు.

2019 ఎన్నికల్లో తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని ఆధునికీకరిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నేడు లిక్విడేషన్ దిశగా అడుగులు వేయడం బాధాకరమన్నారు. జిల్లాలో రోడ్లు, బ్రిడ్జిలు అధ్వానంగా ఉన్నాయన్నారు. జగన్ ప్రభుత్వం ఎనిమిది సార్లు విద్యుత్తు చార్జీలు పెంచిందని గుర్తు చేశారు. బిజెపి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ తన కేసుల నుండి తప్పించుకునేందుకు టిడిపి నుంచి బిజెపిలోకి వెళ్లి పునీతుడైనట్లు మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు.

కేవలం ఈ ప్రాంత వనరులను దోచుకునేందుకే సీఎం రమేష్ అనకాపల్లి నుంచి పోటీ చేస్తున్నాడని విమర్శించారు. ఇండియా వేదిక పార్టీలతోనే అభివృద్ధి సాధ్యమన్నారు.సమావేశంలో కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థులు రుత్తల శ్రీరామ్మూర్తి, బొడ్డు శ్రీనివాసరావు, ఐఆర్ గంగాధర్, బోని తాతారావు, అనంతరావు, భగత్, సిపిఎం జిల్లా నాయకులు గంట శ్రీరామ్, గనిశెట్టి సత్యనారాయణ, సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సిఎం.రమేష్‌పై సిపిఎం ఫిర్యాదు

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘనపై చర్యలకు వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎన్నికల నిబంధనల ఉల్లంఘిస్తున్న అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం బిజెపి అభ్యర్థి సిఎం.రమేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ డిఆర్‌ఓ దయానిధికి సిపిఎం జిల్లా కమిటీ బుధవారం ఫిర్యాదు చేసింది. బిజెపి అభ్యర్థి సిఎం.రమేష్ ఎన్నికల నిబంధనలను పూర్తిగా విస్మరించి ప్రచారం చేయడం, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, తాయిలాలు పంచడం, కుల, మతాల ప్రాతిపదికన ప్రచారం, సమావేశాలు నిర్వహించడం చేస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొంది. అలాగే సిఎం.రమేష్ అభ్యర్థికి సంబంధించిన కరపత్రాల్లో ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రచురణకర్త పేరు, ప్రింటింగ్ ప్రెస్ పేరు, ఎన్ని కాపీలు వంటి వివరాలు లేకుండానే లక్షలాది కరపత్రాలు పంపిణీ చేస్తున్నారని తెలిపింది. ఓటర్లను బిజెపి ఎన్నికల గుర్తు “కమలం పువ్వు” ఆకారంతో విసనకర్రలను, కీ-చైన్లు రూపొందించి వాటిని, స్వీట్ బాక్సులు మహిళా కోలాట దళాలకు బిజెపి ఎన్నికల గుర్తుతో కలిగిన చీరలు వంటివి పంపిణీ చేస్తూ ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని విమర్శించింది. గ్రామాలలో కుల సంఘాలను, ఇతర మతాలను ధూషించే విధంగా ప్రసంగాలు చేస్తూ ఉద్రిక్తతలు సృష్టిస్తున్నారని తెలిపారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుండి వందలాది మందిని ఎన్నికల ప్రచారం పేరుతో అనకాపల్లి జిల్లాకు తీసుకువచ్చి మద్యం, డబ్బు పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి, శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. సిఎం.రమేష్ ప్రచార రథాలుకు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పెద్ద పెద్ద డిజె సౌండ్ సిస్టమ్స్ ఎటువంటి అనుమతులు కట్టి ఉపయోగిస్తున్నారని తెలిపారు. డబ్బు, మంద బలంతో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న సిఎం.రమేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు

అనారోగ్యంతో ఎఎస్ఐ కుశలన్న దొర మృతి

ప్రజాశక్తి -చింతూరు :చింతూరు పోలీస్ స్టేషన్‌లో ఎఎస్‌గా పని చేస్తున్న నోవా కుశలన్నదొర అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. కుశలన్న దొర గత నెల 28వ తేదీన పక్షవాతాన్ని గురి కావడంతో కాకినాడ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. పరిస్థితి విషమించి బుధవారం తమ గ్రామంలో మృతి చెందారు.

ఎఎస్ఐ కుశలన్న దొర

పీపుల్స్ మ్యానిఫెస్టో విడుదల

ప్రజాశక్తి -అచ్యుతాపురం :జన విజ్ఞాన వేదిక రూపొందించిన పీపుల్స్ మేనిఫెస్టోను బుధవారం అచ్యుతాపురం మండలం, హరిపాలెం గ్రామంలో ఆ సంస్థ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి బొడ్డేడ రామ్ కుమార్ మాట్లాడుతూ సైంటిఫిక్ టెంపర్, సైన్స్ అండ్ టెక్నాలజీ పాలసీ దాని ఆచరణ, పర్యావరణం, జల వనరులు, ఆరోగ్యం, వ్యవసాయం, విద్య, ఆంధ్రప్రదేశ్ సంబంధించి విభజన హామీలు, విశాఖ ఉక్కు -ఆంధ్రుల హక్కు వంటి వాటిపై రాజకీయ పార్టీలు తమ కార్యచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్య రంగాలకు జీడీపీలో తొమ్మిది శాతం కేటాయింపు, శాస్త్ర పరిశోధన కోసం మూడు శాతం కేటాయించడం, ప్రభుత్వ ఉద్యోగాలలో ఖాళీలన్నీ ఒకేసారి ప్రకటించి భర్తీ చేయడం, ఒక హక్కుగా నిరుద్యోగ భృతి చెల్లించడం, విభజన హామీలకు రాష్ట్ర ప్రాజెక్టులకు అభివృద్ధికి అవసరమైన నిధులను కేంద్రాన్ని డిమాండ్ చేసి రాబట్టడం, ప్రజల మధ్య సామరస్యం, సుహృద్భావం ప్రాణప్రదమైనవని భావించడం రాజ్యాన్ని మతానికి దూరంగా ఉంచడం, ఒక ఆధునిక దేశంగా తీర్చిదిద్దడం, రాజ్యాంగ పరిరక్షణ ఎన్నికల కమిషన్, సిబిఐ, ఈడి లాంటి సంస్థలను నిష్పక్షపాతంగా స్వతంత్రంగా పనిచేసేలా ఒక బలమైన చట్టం తేవడం, రాష్ట్ర వనరులను కాపాడడం, పర్యావరణ హితంగా రాష్ట్రాన్ని మార్చడం, ఆరోగ్యకరమైన జీవన శైలిని ప్రోత్సహించడం మొదలగు అందరి జీవితాలను ప్రభావితం చేస్తున్న విషయాలు ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు అనుకుంటే చేయగలిగే విషయాలేనని ఆయన పేర్కొన్నారు. ఈ అంశాలపై తమ వైఖరి తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు మారిశెట్టి వెంకట అప్పారావు, కాండ్రేగుల రామ సదాశివరావు, కాండ్రేగుల బాబురావు తదితరులు పాల్గొన్నారు.